క్లుప్తంగా

ఆంజనేయ ఆలయంలో ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో సుందర అభయాంజనేయ స్వామి

తాటిచెట్లపాలెం : జీవీఎంసీ 45 వ వార్డు పరిధి తాటిచెట్లపాలెం జాతీయ రహదారిపక్కన గల సుందర అభయాంజనేయ స్వామి ఆలయంలో మంగళవారం సందర్భంగా ఉదయం నుంచి ప్రత్యేక పూజలు, పంచామృతాభిషేకాలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యుల పర్యవేక్షణలో భక్తులు దర్శనాలు చేసుకుని, తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయ అర్చకులు అల్లవరపు వెంకట ఏకాంబరేశ్వరస్వామి పూజలు నిర్వహించారు.

యూనియన్ బ్యాంకు రుణ మేళా



కారు తాళాలు అందిస్తున్న డీజీఎం రాధాకృష్ణ

సీతమ్మధార : తక్కు వడ్డీరేట్లకు తక్షణ రుణ సదుపాయం కల్పించడానికి రిటైల్ రుణ మేళాను నిర్వహిస్తున్నామని యూనియన్ బ్యాంకు రీజనల్ హెడ్ కె.నటరాజ్ అన్నారు.ఈ మేరకు మంగళవారం యూబీఐ, సీతమ్మధార శాఖ కేంద్ర కార్యాలయంలో రూ.11 కోట్లు విలువైన రుణ మేళా ద్వారా వాహనాలు అందించే కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్యాంకు శాఖలను సంప్రదించి సత్వరమే రుణాలను పొందవచ్చునన్నారు. 20 మంది లబ్ధిదారులకు డీజీఎం రాధకృష్ణ చేతులు మీదగా కారు తాళాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏజీఎం ఐఎస్‌ఎస్‌మూర్తి, చీఫ్ మేనేజర్లు ఏకే పాండా, అమర్ దీప్‌కుమార్, బి.తిలక్, వివిధ శాఖల మేనేజర్లు, అధికారులు పాల్గొన్నారు.

మోసగించిన బాలుడిపై కేసు నమోదు

సీతమ్మధార : నమ్మించి మోసం చేసిన కేసులో బాలుడిపై పోక్సో కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా.. శంకమఠం ప్రాంతానికి చెందిన బాలిక..గోపాలపట్నంకు చెందిన ఐటీఐ చదువుతున్న ఓ విద్యార్థి స్నేహితులుగా దగ్గరయ్యారు. దీంతో పెళ్లి చేసుకుంటానని చెప్పి లైంగిక దాడికిపాల్పడ్డాడు. బాలిక ఫొటోలు, వీడియోలు తీసి బెదిరింపులకు దిగాడు. బాలిక ఫిర్యాదు మేరకు ఫోర్తుటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. బాలుడిపై పోక్సో కేసు నమోదు చేసినట్టు పోలీసులు తెలిపారు.

ఉక్కు ప్రజాగర్జనను విజయవంతం చేయండి



అల్లూరి సీతారామరాజు జంక్షన్‌లో నిరసన చేస్తున్న ఏఐటీయూసీ నాయకులు

సీతమ్మధార: విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని ఏఐటీయూసీ నేతలు డిమాండ్ చేశారు. సీతమ్మధార అల్లూరి సీతారామరాజు విగ్రహం వద్ద మంగళవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఏఐటీ యూసీ జిల్లా కార్యదర్శి జి.వామనమూర్తి, సీపీఐ జిల్లా సంఘం సభ్యుడు పడాల గోవింద్ మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను రద్దు చేయాలన్నారు. ఈ నెల 30న ఉక్కు ప్రజాగర్జనను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రవికృష్ణ, అశోక్, నక్క సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

భాగవత సప్తాహం ప్రారంభం



అనుగ్రహ భాషణం చేస్తున్న సిద్ధేశ్వరానంద భారతీ మహాస్వామి



హాజరైన భక్తులు

సీతంపేట: లలితాపీఠంలో భాగవతసప్తాహం మంగళవారం సాయంత్రం ప్రారంభమైంది. కుర్తాళం శంకరాచార్య జగద్గురు సిద్ధేశ్వరానందభారతీ మహాస్వామి భాగవత ప్రవచనం ప్రారంభించారు. తొలిరోజు వ్యాస మహర్షి జీవిత విశేషాలు వివరించి భాగవత ప్రాశస్తిని, భాగవత శ్రవనం, మననం ఎలా మోక్షప్రదమో స్వామి తన అనుగ్రహ భాషణంలో వివరించారు.

ఘనంగా బ్రహ్మోత్సవాలు

లలితాపీఠంలో జరుగుతున్న 74వ బ్రహ్మోత్సవాలలో భాగంగా మంగళవారం 'ఆదిత్యాది నవగ్రహ సహిత అష్టముఖ గండభేరుండ జ్వాలానారసింహ సుదర్శన మహా యాగం' ప్రారంభమైంది. కుర్తాళం పీఠాధిపతి సిద్ధేశ్వరానంద భారతీ మహాస్వామి 87వ జన్మదినం సందర్భంగా లోక కల్యాణార్థం 11 రోజులపాటు విశేష పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. పీఠం ఆస్థాన పండితులు మాచవోలు రమేష్ శర్మ నేతృత్వంలో పండితుల వేదమంత్రాల మధ్య అత్యంత వైభవంగా సుదర్శన యాగం ప్రారంభమైంది. లలితాపీఠం దర్బారు హాల్లో సిద్ధేశ్వరానంద భారతీ మహాస్వామి 87వ అవతరణోత్సవ మహాపూజ, స్వామి వారికి విశేష పుష్పాభిషేకం జరిగింది. అనంతరం జరిగిన సభలో స్వామి వారు భాగవత సప్తాహ ప్రవచనం చేసారు. ఈ నెల 30వ తేదీ వరకు ప్రతి రోజూ సాయంత్రం భాగవత సప్తాహ ప్రవచనం జరుగుతుందని పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ తెలిపారు. బుధవారం ఉదయం నుంచి భక్తులకు స్వామి వారి దర్శనాలు, మంత్రోపదేశం చేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో శక్తి పీఠాధీశ్వరి రమ్యానంద భారతీ స్వామి, సిద్ధేశ్వరి పీఠం సీఈవో మోచర్ల శశిభూషణ్ పాల్గొన్నారు.



లలితాపీఠంలో సుదర్శన మహాయాగం చేస్తున్న వేద పండితులు

వచ్చే నెల 12న ఎస్‌ఎఫ్‌ఎస్ స్కూల్ ఫెస్ట్



ఫెస్ట్ కరపత్రం ఆవిష్కరిస్తున్న నెడ్‌క్యాప్ చైర్మన్ కేకేరాజు

సీతమ్మధార (విశాఖ ఉత్తర): నైపుణ్యానికి నిలువుటద్దం ఎస్‌ఎఫ్‌ఎస్ స్కూల్ అని రాష్ట్ర నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర సమన్వయకర్త కేకేరాజు అన్నారు. మంగళవారం సీతమ్మధార ఎస్‌ఎఫ్‌ఎస్ స్కూల్ ప్రాంగణంలో సాంస్కృతిక, విద్యారంగాల్లో ప్రతిభ కనబరిచిన వారికి అభినందన, ఫెస్ట్ కరపత్రం ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఎస్‌ఎఫ్‌ఎస్ స్కూల్ స్థాపించిన సెయింట్ (ఫాన్సిస్ డి.సేల్స్)వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కేకేరాజు మాట్లాడుతూ విశ్వవ్యాప్తంగా ఎంతో మంది మేధావులను అందించిన ఘనత ఎస్‌ఎఫ్‌ఎస్ స్కూల్‌దేనని అన్నారు. స్కూల్ ప్రిన్సిపాల్ రెవరెండ్ ఫాదర్ మనోజ్ మాట్లాడుతూ స్కూల్ ఏర్పాటు చేసి 50 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా త్వరలో ఘనంగా ఉత్సవాలను నిర్వహిస్తామన్నారు. ఫిబ్రవరి 12న విద్యార్థుల ప్రతిభను ప్రోత్సహిస్తూ విజ్ఞాన, వినోదాల కలయికతో ఎస్‌ఎఫ్‌ఐ స్టూడెంట్ ఫెస్టివల్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థుల నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో 24 వార్డు కార్పొరేటర్ సాడి పద్మా రెడ్డి, కంచర్ల చిత్రం హీరో కంచర్ల ఉపేంద్ర, కొరియోగ్రాఫర్ నాగరాజు పట్నాయక్, అధ్యాపకులు పాల్గొన్నారు.



నృత్యం చేస్తున్న విద్యార్థులు

అలరించిన సంగీత విభావరి

సీతంపేట: సత్య సుమధుర స్వరాలు కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో జరిగిన తెలుగు హిందీ సినీ సంగీత విభావరి ఆకట్టుకుంది. అతిథులుగా హాజరైన సామాజికవేత్త సన్ మూర్తి, సంఘ సేవకులు జీవీ అంజనేయులు, కుమార్, ఎస్.ఎస్.ఎస్.నాయుడు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. నేనొక ప్రేమ పిపాసిని, ఏ దిల్ నా హోతా బేచారా అనే రెండు శీర్షికలతో ద్విభాషా సినీ సంగీత విభావరి నిర్వహించారు. పి.బి ఖాన్ నిర్వహణలో గాయనీమణులు సత్యవతి ఖాన్ , ధరణి, ఎస్.ఆర్. రాజేశ్వరి, జాస్మిన్, సి.వి.రాజేశ్వరి, భాగ్యలక్ష్మి, గాయకులు నరసింహమూర్తి, ప్రసాద్, మహమ్మద్‌ఖాన్, రాము, సాంబశివరావు, యాదగిరి, రాజు తదితరులు పలు హిట్ సాంగ్స్ ఆలపించి అలరించారు. నిన్న లేని అందమేదో, వెన్నెల రేయి ఎంతో చలి చలి, చెంగావి రంగు చీర, ఆదా హై చంద్రమా అంటూ పాడిన పాటలు ప్రేక్షకులను ఉర్రూతలూ గించాయి. అనంతరం గాయనీగాయకులను అతిథులు సత్కరించారు.



గాయనీ గాయకులను సత్కరిస్తున్న సన్‌మూర్తి

గ్రీన్ బెల్ట్‌కు రక్షణ కరువు

సీతంపేట: స్థానిక సత్యం సెంటర్ కూడలి నుంచి గురుద్వారా వరకు ఉన్న హైవేకు అనుకొని ఉన్న గ్రీన్ బెల్ట్‌కు రక్షణగా వేసిన ఫెన్సింగ్ ధ్వంసం కావడంతో రక్షణ కరువైంది. ఫెన్సింగ్ కోసం ఏర్పాటు చేసిన ఐరన్ పోల్స్ కిందభాగంలో తుప్పు పట్టడంతో విరిగిపోయాయి. ఐరన్ పోల్స్, ఇనుప తీగలు తరలిపోయాయి. దీంతో హైవేకు మణిహారంగా ఉన్న గ్రీన్‌బెల్ట్‌లో పచ్చదనానికి రక్షణ కరువైంది. ఫెన్సింగ్ లేకపోవడంతో రాత్రి సమయంలో ఆకతాయిలు, మందుబాబులు గ్రీన్ బెల్ట్‌లోకి ప్రవేశిస్తున్నారు. మందుబాబులు ఇక్కడే తిష్టవేసి అసాంఘిక కార్యకలాపాలకు అడ్డగా మార్చుకున్నారు.

ఆక్రమణలకు అవకాశం

గతంలోగ్రీన్ బెల్ట్ ప్రాంతానికి రక్షణగా ఏర్పాటు చేసిన ఫెన్సింగ్ ధ్వంసమవడంతో చాలా వరకు క్రమణకు గురైంది. ఇసుక, పిక్క, ఇటుక వ్యాపారులు, చిరు వ్యాపారులు, వాహనాల మెకానిక్‌లు గ్రీన్ బెల్ట్ ప్రాంతాన్ని ఆక్రమించి వ్యాపారాలకు అడ్డాగా మార్చుకున్నారు. హుదూద్ సమయంలో గ్రీన్ బెల్ట్ ప్రాంతంలో చాలా వరకు చెట్లు కూలిపోయాయి.. హుదూద్ నష్టం నుంచి కోలుకున్న తర్వాత 2015లో గ్రీన్ బెల్ట్ ప్రాంతంలో పెద్ద సంఖ్యలో జీవీఎంసీ మొక్కలు నాటింది. తిరిగి ఐరన్ పోల్స్‌తో ఫెన్సింగ్ ఏర్పాటు చేసి రక్షణ కల్పించారు. ఫెన్సింగ్ వేసి సుమారు ఎనిమిదేళ్లు కావడంతో చాలా వరకు ఐరన్ పోల్స్ తుప్పు పట్టి శిథిలమవుతున్నాయి. ఫలితంగా గ్రీన్ బెల్ట్‌కు రక్షణ కరువైందనే చెప్పాలి. ప్రస్తుత పరిస్థితిలో గ్రీన్ బెల్ట్ ఆక్రమణలకు గురయ్యే అవకాశం ఉందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జీవీఎంసీ అధికారులు స్పందించి గ్రీన్ బెల్ట్ రక్షణకు చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు. అలాగే మందుబాబులు, ఆకతాయిల బెడద లేకుండా పోలీస్ గస్తీ ముమ్మరం చెయ్యాలని కోరుతున్నారు.



సత్యం సెంటర్ వద్ద హైవేకు అనుకుని ఉన్న గ్రీన్‌బెల్ట్‌కు రక్షణగా వేసిన ఫెన్సింగ్ మాయం



చెట్లు లేక ఖాళీగా కన్పిస్తున్న గ్రీన్‌బెల్ట్

పేదల పక్షపాతి సీఎం జగన్



కేకే రాజును ఆశీర్వదిస్తున్న వృద్ధురాలు



సమస్యలు తెలుసుకుంటున్న కేకే రాజు

కంచరపాలెం: ప్రజల సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమాన్ని రూపకల్పన చేశారని వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గం సమన్వయకర్త, రాష్ట్ర నెడ్ క్యాప్ చైర్మన్ కేకే రాజు అన్నారు. జీవీఎంసీ 46వ వార్డు సూరిబాబునగర్, మధుసూధననగర్ సచివాలయాల పరిధిలో మంగళవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో జీవీఎంసీ డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్‌తో కలిసి వార్డులో పర్యటించారు. ఇటీవల శంకుస్థాపన చేసిన అభివృద్ధి పనులు త్వరగా ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని ఇంజినీరింగ్ అధికారులను ఆయన ఆదేశించారు.

సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపట్టిన నాటి నుంచి నేటి వరకు ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తున్నారన్నారు. విద్య, వైద్యం, ఉపాధి ప్రతి పేదోడికి అందే విధంగా పరిపాలన కొనసాగిస్తున్నారన్నారు. కార్యక్రమంలో జోన్-5 డీఈ భరణికుమార్, కో-ఆప్షన్ సభ్యుడు అప్పారావు, డైరెక్టర్ ఎం.నూకరాజు, వార్డు నాయకులు గోవింద్ చిన్నారావు, కృష్ణ, రమణ, రామారావు, ఈశ్వరరావు, అనిల్, శర్మ, దేవి, బాల, ఈశ్వరరావు, జీవీఎంసీ సిబ్బంది, సచివాలయం సిబ్బంది, వలంటీర్లు, తదితరులు పాల్గొన్నారు.

కళింగుల ఆత్మీయ కలయికకు ఏర్పాట్లు



కళింగులను ఆహ్వానిస్తున్న పేడాడ రమణికుమారి

మద్దిపాలెం: మాధవధార మాధవస్వామి ఆలయ ప్రాంగణంలో ఈ నెల 29న కళింగుల ఆత్మీయ కలయిక నిర్వహించనున్నట్టు నిర్వాహకురాలు, వైఎస్సార్‌సీపీ మహిళా నాయకురాలు పేడాడ రమణికుమారి తెలిపారు. ఈ మేరకు మంగళవారం కళింగ కుటుంబ సభ్యులను కలిసి కార్యక్రమానికి ఆహ్వానించారు. కళింగనగర్, నరసింహనగర్, సీతన్నగార్డెన్స్‌లో కళింగ బృందం పర్యటించింది.

రైతుబజార్‌లో తనిఖీలు



నరసింహనగర్ రైతుబజార్‌లో తనిఖీ చేస్తున్న మార్కెటింగ్ శాఖ ఏడీ ఎస్‌కే యాసిన్

సీతంపేట: వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ ఎస్‌కే యాసిన్ నరసింహనగర్ రైతుబజార్‌ను తనిఖీ చేశారు. ప్రతి స్టాల్‌ను సందర్శించి స్టాల్ కేటాయించిన వారు ఉన్నారో లేరో తనిఖీ చేశారు. కూరగాయల నాణ్యత, ధరల పట్టిక పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ద్వాక్రా, పీహెచ్ స్టాల్స్‌లో స్టాల్ కేటాయించిన వ్యక్తి తప్పకుండా ఉండాలని లేదంటే స్టాల్ తెరవనివ్వవద్దని ఎస్టేట్ ఆఫీసర్‌ను ఆదేశించారు. ప్రతి ఒక్కరూ గుర్తింపు కార్డులు పెట్టుకోవాలని, కేటాయించిన స్టాల్‌లో విక్రయాలు చేపట్టాలని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్టేట్ ఆఫీసర్ పి.చినబాబు, సహాయకుడు ఆర్.సత్యనారాయణ పాల్గొన్నారు.

రోడ్డుపైనే భవన నిర్మాణ సామగ్రి

సీతమ్మధార : సీతమ్మధారలో భవన నిర్మాణ యజమానులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. వాహనదారులకు, పాదచారులకు ఇబ్బందులు కలగజేస్తున్నారు. భవన నిర్మాణాల సంబంధించి పిక్క, ఇసుక రోడ్డును ఆక్రమించి డంప్ చేస్తున్నారు. టీపీటీ కాలనీలోని రహదారికి అడ్డంగా కాంక్రీట్ మెషీన్‌తో పాటు నిర్మాణ సామగ్రి అడ్డుగా వేశారు. అలాగే జీవీఎంసీ పరిధిలోని 14, 24వ వార్డులోని రేసపువానిపాలెం, నక్కవానిపాలెం, సీతమ్మధార ప్రాంతాలు, నార్త్‌ఎక్స్‌టెన్షన్ పరిధిలో రహదారులను ఆక్రమించుకుని భవన నిర్మాణ సామగ్రి డంప్ చేయడం వల్ల వాహనాలు అదుపుతప్పుతున్నాయి. ట్రాఫిక్ స్తంభిస్తోంది. ఇప్పటికైనా జీవీఎంసీ అధికారులు స్పందించి రహదారులపై భవన నిర్మాణ సామగ్రి డంప్‌చేయకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు.



టీపీటీ కాలనీలోని రోడ్డుకు అడ్డంగా భవన నిర్మాణ సామాగ్రి

అభివృద్ధిని ప్రజలకు వివరించాలి



మాట్లాడుతున్న నెడ్‌క్యాప్ చైర్మన్ కేకే రాజు

సీతమ్మధార : అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందేలా చూడాలని వైఎస్సార్‌సీపీ ఉత్తర సమన్వయకర్త, నెడ్‌క్యాప్ చైర్మన్ కేకేరాజు అన్నారు. జీవీఎంసీ పరిధి 14 వార్డు బాలయ్య శాస్త్రిలేఅవుట్‌లోని పార్టీ కార్యాలయంలో మంగళవారం కార్పొరేటర్లు, నాయకులతో కేకే రాజు సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న రోజుల్లో పార్టీ కార్యక్రమాలతో పాటు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ ఫలాలు అర్హులందరికి అందేలా చూడాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. నియోజకవర్గ అభివృద్ధిని ప్రజలకు వివరించాలన్నారు. సేవా దృక్పథం కలిగిన వారు, అంకితభావంతో పనిచేసేవారిని పార్టీలో చేర్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, ఫ్లోర్‌లీడర్ బాణాల శ్రీనివాసరావు, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ అల్లు శంకరరావు, స్టాండింగ్ కమిటీ మెంబర్ సారిపల్లి గోవింద్, కార్పొరేటర్లు కటారి అనిల్ కుమార్‌రాజు, సేనాపతి అప్పారావు, సాడి పద్మారెడ్డి , ఆళ్ల లీలావతి, పి.ఉషశ్రీ, కె.కామేశ్వరీ, రెయ్యి వెంకటరమణ, శశికళ, వార్డు అధ్యక్షులు పీలా వెంకటలక్ష్మి, గుజ్జు వెంకటరెడ్డి, నీలిరవి, కె.పి.రత్నాకర్, షేక్ జుబేర్, దుప్పలపూడి శ్రీనివాస్ మాజీ కార్పొరేటర్లు బులుసు జగదీష్, కె.వెంగళరావు, పోతు సత్యనారాయణ, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ ఫేస్‌యాప్‌ను రద్దు చేయాలి



ఐసీడీఎస్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీ ఆయాలు,కార్యకర్తలు

మద్దిపాలెం: అంగన్వాడీ కార్యకర్తలకు భారంగా ఉన్న ఫేస్ యాప్‌ను రద్దు చేయాలని, వైఎస్సార్ సంపూర్ణ పోషణ మెనూ చార్జీలను పెంచాలని ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ అధ్యక్షురాలు బి.తులసి డిమాండ్ చేశారు. ఆర్‌అండ్‌బీ వద్ద ఉన్న అర్బన్-1 ఈడీపీఓ కార్యాలయం వద్ద మంగళవారం అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు నిరసన వ్యక్తం చేశారు. కేంద్రాల్లో నిర్వహిస్తున్న వంటకు వినియోగించే గ్యాస్ ప్రభుత్వమే సరఫరా చేయాలని, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని పేర్కొన్నారు. అనంతరం అర్బన్-1 సీడీపీఓ ఎం.వి.రమణికుమారికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో జి.లక్ష్మి, బి.సంధ్య, ఎన్.ప్రియ, అరుణకుమారి, పలువురు కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.

తెలుగు విభాగం సందర్శన

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం తెలుగు విభాగాన్ని మంగళవారం తెలుగు, సంస్కృత అకాడమీ చైర్‌పర్సన్ డాక్టర్ నందమూరి లక్ష్మీపార్వతి సందర్శించారు. ఆమెతో పాటు రెక్టార్ ఆచార్య కె.మమత పీజీ ప్రథమ సంవత్సరం విద్యార్థులతో మమేకమయ్యారు. తెలుగు భాషను పరిరక్షించాల్సిన బాధ్యత, సంస్కృతి సంప్రదాయాలను రక్షించవలసిన ఆవశ్యకతను లక్ష్మీపార్వతి వివరించారు. విద్యార్థి దశ అత్యంత కీలకమైనదని, ఈ వయస్సులో తప్పటడుగులు వేయటానికి ఎక్కువ అవకాశం ఉంటుందని, అందుకోసం మనస్సు సాహిత్యం వైపు మరల్చి చక్కగా చదువుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగు శాఖాధిపతి ఆచార్య జర్ర అప్పారావు, తెలుగు ఆచార్యులు డాక్టర్ అన్నంశెట్టి ఈశ్వరమ్మ, డాక్టర్ బూసి వెంకటస్వామి, పెండ్యాల లావణ్య, ఆతుకూరి వెంకటేశ్వర్లు(యోగి), బోధనేతర సిబ్బంది, పరిశోధక, స్నాతకోత్సవ విద్యార్థులు పాల్గొన్నారు.



తెలుగు విభాగం వద్ద డాక్టర్ లక్ష్మీపార్వతి, ఆచార్యులు

కొట్లాట కేసులో ముగ్గురికి జైలు

విశాఖ,లీగల్ : కుటుంబ సభ్యుల మధ్య జరిగిన స్వల్ప వివాదంలో నేరం రుజువు కావడంతో 6 నెలలు జైలు శిక్ష, 3వేలు జరిమాన విధిస్తూ నగరంలోని ఒకటో అదనపు ప్రధాన మెట్రోపాలిటిన్ మెజిస్ట్రేట్ ఎం.యుగంధర్ మంగళవారం తీర్పునిచ్చారు. జరిమాన చెల్లించని పక్షంలో అదనంగా నెల రోజులు సాధారణ జైలు శిక్ష అనుభవించాలని న్యాయమూర్తి పేర్కొన్నారు. అదనపు పబ్లిక్ ప్రాసక్యూటర్ ఆర్.వాణి అందదించిన వివరాలు ఇలా ఉన్నాయి. నిందితులు షేక్ ఇస్మయిల్ , కైలాష్ బాబా మదీనా వల్లిలు ద్వారక పోలీసు స్టేషన్ పరిధిలోని సీతంపేటలో ఉంటున్నారు. వీరికి తమ సమీప కుటుంబ సభ్యుల మధ్య ఆస్తి వివాదాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో 2019 మే 26న ఇరు కుటుంబ సభ్యులు గొడవ పడగా స్వల్ప గాయాలయ్యాయి. ఇరు కుటుంబాలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. న్యాయమూర్తి 2 కేసులను విచారణ జరిపారు. నిందితులపై నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి పైవిధంగా తీర్పునిచ్చారు.

ఏయూను సందర్శించిన బౌద్ధ భిక్షువు

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయాన్ని శ్రీలంకకు చెందిన బౌద్ధ సన్యాసి అమునుదోవే హేమసిరి థెరో మంగళవారం సందర్శించారు. వర్సిటీలోని గాంధీజీ అధ్యయన కేంద్రాన్ని పరిశీలించారు. అనంతరం ఆయన వీసీ పీవీజీడీ ప్రసాదరెడ్డితో మర్యాద పూర్వకంగా భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఏయూ తరఫున బౌద్ధ భిక్షువును వీసీ సత్కరించి జ్ఞాపిక అందజేశారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ ఆంధ్ర విశ్వవిద్యాలయం బౌద్ధ అధ్యయనాలను ప్రోత్సహిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో గాంధీయన్ స్టడీస్ సెంటర్ డైరెక్టర్ డాక్టర్ చల్లా రామకృష్ణ, విద్యా విభాగాధిపతి డాక్టర్ షారోన్ రాజు, సెంటర్ ఫర్ ఎమోషనల్ ఎడ్యుకేషన్ సెక్రటరీ డాక్టర్ కృష్ణవీర్ అభిషేక్ పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్యస్వామికి ప్రత్యేక పూజలు



సుబ్రహ్మణ్యస్వామి క్షీరాభిషేకం చేస్తున్న భక్తులు

కంచరపాలెం : స్థానిక కంచరపాలెం ఊర్వశి జంక్షన్ కూడలి రవీంద్రనగర్‌లోని సుబ్రహ్మణ్యస్వామి ఏకాంత ఆలయంలో మాఘ మాస శుద్ధ తదియ మంగళవారాన్ని పురస్కరించుకుని శరవణ ట్రస్ట్ చైర్మన్, ఆలయ ధర్మకర్త దేవాల రాజు ఆధ్వర్యంలో సుబ్రహ్మణ్యస్వామికి స్కంద పూజలు నిర్వహించారు. అష్టోత్తర శత కలశాభిషేకం , సహస్రనామం, విభూది, పుష్పలతో అర్చనలు చేశారు. మధ్యాహ్నం ఆలయ ఆవరణలో భక్తులకు ప్రసాద వితరణ నిర్వహించారు. ఆలయ పునఃనిర్మాణ పనులకు భక్తులు, దాతలు ముందుకు రావాలని ఆలయ ధర్మకర్త దేవాల రాజు కోరారు.